**కథ**

# నగర చిత్రం

**దొరవేటి**

**'ధనమూలం-ఇదం జగత్!' అనే మాట నాగరీకుల నుండి పుట్టిందే కదా! డబ్బుండాలేగాని దొరకని సుఖం లేదనిపించింది మా యాదగిరిని చూస్తే. 'సారీ' వాణ్ణిప్పుడు యాదగిరి అనకూడదు. కె.వై.గిరి అనాలి. అట్లా అంటేనే వాడికి సంతోషం, మనకి సేఫ్టీ. కే అంటే 'కొండి'.**

మా ఊళ్ళో ఎనిమిదో తరగతి లేనందుకు మా నాన్న నన్ను భోనగిరిలో అమ్మమ్మవాళ్ళ దగ్గరుంచి చదివించాడు. వాళ్ళది రెక్కాడితే గాని డొక్కాడని ప్రపంచం. అక్కడా బస్తీ (టౌను) వాసనలు పిల్చలేకపోయాను. ఇల్లు-స్కూలు, సెలవుల్లొస్తే ఊరు. అంతకు మించి ఏమీ తెలిసేది కాదు. హైస్కూల్లో చదివే రోజుల్లోనే గిరిగాడితో పరిచయం. నాన్న పత్తి మందుకి బలైపోవడంతో నా చదువు ఎస్.ఎస్.సి. గడప దాటకుండానే ఆగిపోయింది. వీడు బాగా చదివి, హైదరాబాద్‌లో హాయిగా బతికేస్తున్నాడు.

ఉత్తరాలు మా మధ్య స్నేహాన్ని చెరగకుండా కాపాడటమేగాక, ఇతోధికంగా పెంచుతూనే ఉన్నాయి. నేనెప్పుడూ హైదరాబాదు ముఖం చూసెరగను. మా గిరిగాడు చాలాకాలంగా ఇక్కడికి రమ్మని పోరు పెడుతున్నా తీరిక దొరకలేదు. వ్యవసాయమంటేనే పని. భూమిపుత్రులకు పనిలేందెన్నడు. 'మరో నెల రోజుల్లో పెళ్ళి చేసుకోబోతున్నాను. తర్వాత ఇంత స్వేచ్ఛ ఉండదు ర'మ్మని వాడు ఖచ్చితంగా రాస్తే, వారం రోజులుగా తీవ్ర ప్రయత్నం చేస్తే గాని ఈ అవకాశం దొరకలేదు.

నిన్న మొన్నటి వరకు మా తుమ్మలగూడెమే ఎంతో అందమైన ప్రపంచం అనుకున్నా బావిలో కప్పలా. ఎర్రటి పైకప్పుల్తో, పచ్చని పొలాల మధ్య పరుచుకున్న ఊరు; ఊరి పక్కనే కుంట; కుంట కట్ట కవతల కనుచూపుమేరంతా వరి పొలాలు; తొలికాలంలో కన్పించే ఇంద్రధనుస్సులు; వాగులోంచి కుంటలోకి పరుగులు పెడ్తూ వచ్చి కలిసే పిల్ల కాలువలు; కుంట నిండి అలుగుపై నుండి సంతోషంగా దూకిపోయే నీళ్ళు, ఆ నీళ్ళ వేగాన్ని సవాల్ చేస్తూ పిట్టల్లా ఎగుర్తూ మళ్ళీ కుంటలో చేరుకునేందుకు ప్రయత్నించే చేపలు; వాటిని పట్టుకునేందుకు - పడుతూ లేస్తూ మిడతల దండులా పోగయ్యే పిల్లలు; ఆ గుంపులో అందరూ తిడ్తున్నా పట్టించుకోకుండా పోటీపడే సెందిరిగాడు... అంతేనా-

'ఆవు ఈనింది జున్ను జేసుకోం' డంటూ ముంతనిండా పాలు దెచ్చిచ్చే ఆండాలు; ళ్ళాగినప్పుడు పెళ్ళాన్ని, మత్తు దిగింతర్వాత పెళ్ళాంతో తన్నుల జగడాలాడుకునే రాజిగాడు; వరినాట్లెయ్యడానికొచ్చే ఆడాళ్ళలో కొత్తగా చేరిన వేడి చూపుల శకుంతల అందాలు..ఇలా చెప్పుకుంటూ పోతే రోజులు చాలవు..అలా ఎంతో గొప్పదనుకున్న మా ఊరికంటే లక్షల రెట్లు ఈ నగరం అందమైందీ, అద్భుతమైందీనూ. ఇంకానయం- ఈ అందాలన్నీ మా గిరిగాడికి వర్ణించి- వర్ణించి చెప్పాలనుకున్నా - ఆ పని చేయకపోవడమే మేలైంది. నగరం అందాల ముందు అవి యేపాటి?

వచ్చిన రోజే 'మల్లీశ్వరి' సినిమా జూయించాడు. బతికున్న రోజుల్లో ఇదే పేరున్న సినిమా మా నాన్న జూశాడట. ఎదురైన వాడికల్లా ఆ సినిమా 'గొప్పగా' చెప్పేవాడు. ఊరికెళ్ళాక నేనూ ఈ సినిమా గురించి చెప్పుకోవచ్చనుకున్నా. కాని, దానికీ-దీనికీ పోలికే లేదు. అయినా నాకు ఈ సినిమా నచ్చింది. ఓ రాజకుమారి-పైబట్టలొలిచేసి -లోపలి భాగాలు కూడా కనిపించేటట్టు రాసుకు-పూసుకు తిరుగుతూంటే-ఎవరికిమాత్రం చూడాలనిపించదు చెప్పండి? కాని ఆ సినిమా చూడ్డానికి మా ఇద్దరికే రెండొందలు తగలేశాడు మా గిరిగాడు. ఏమాటకామాటే చెప్పుకోవాలి-టికెట్లకే వంద అయినా, ఏం సుఖం? నా సామిరంగా! హాయిగా ఇంట్లో దూది పరుపుమీద గూచొని చూసినట్టే వుంది.

మరుసటి రోజు లుంబినీ వెళ్ళాం. సాయంత్రం పూట నలభై రెండడుగుల ఎత్తున్న బుద్ధ విగ్రహం- మా జిల్లా నుండే వచ్చిందని తెలిసి, ఛాతీ వెడల్పైంది. మలిసంజ వెలుగులు ఆ మహా విగ్రహానికి బంగారుపూత పూశాయి. కదుల్తున్న సాగర్ జలాల్లో ఆ ప్రతిమ కైలాసగిరిలో నర్తిస్తున్న నటరాజులా అనిపించింది. అప్పుడప్పుడే వెలిగిన విద్యుద్దీపాలు పున్నమి రాత్రి చుక్కల్లా నీళ్ళలో ప్రతిఫలిస్తూంటే మేను మరచి, నన్ను నేను మరచి చూస్తూండిపోయాను.

''లాంచీలో వెళ్దామా? బోట్‌లోనా?'' ఏదో ప్రపంచంలో ఉన్న నన్ను గిరి కుదిపాడు.

''దానికెంత? దీనికెంత?'' తేరుకుంటూ అమాయకంగా అడిగాన్నేను.

''ఒరేయ్! ఆ సంగతి అడగొద్దన్నానా? నీకేది ఇష్టమో అది చెప్పు ముందు'' మెత్తగా కసురుకున్నాడు వాడు.

చల్లని నీటి తుంపర్లు ఏసీలా ఒంటికి హాయినిస్తుంటే ఆకాశంలో మబ్బుల్లోంచి దూసుకుపోయే విమానంలాగే నీటిని చీల్చుకుంటూ పోతున్న ఆ మెకానికల్ బోట్ ప్రయాణం ఎంత థ్రిల్లింగ్‌గా ఉందో చెప్పలేను.

మూడోరోజు ఉదయం గోల్కొండ- అప్పటి వాస్తు శిల్పుల సునిశిత దృష్టి, అద్భుత మేధా సంపత్తి విస్మయం కల్గించాయి. కింద మాట్లాడితే మూడో అంతస్థులో వినిపించే ఏర్పాటు, రక్షా కవచంలా కోట గోడల్ని ఏర్పాటుచేసిన తీరు అద్భుతం. జైలు గోడల మీద రామదాసు గీచిన బొమ్మలు గుండెపొరల్లో భద్రాద్రిని కదిలించాయి. ఒక పక్క నగర ప్రజల దాహార్తిని తీర్చే గండిపేట- ఉస్మాన్ సాగర్ జలాలు, మరోపక్క పేకమేడల్లాంటి అందమైన నిర్మాణాలు, అటు ప్రకృతి, ఇటు కుతుబ్‌షాహి సమాధులు...భాగమతి ప్రణయగాథను, విశ్వేశ్వరయ్య మేథా సంపత్తిని..ఎన్నెన్నో చారిత్రక ఘట్టాలను కళ్ళముందు ఆవిష్కరించాయి.

సాయంత్రం బిర్లామందిర్- అడుగడుగునా పాలరాతి స్వాగతాలు భక్తిని, సౌందర్యానురక్తినీ ఏకకాలంలో తట్టిలేపాయి. గుడిగోడల మీద శ్రీ రామచరిత మానస్ శిల్పాలు, గర్భగుడి చుట్టూ ఉన్న దశావతారాలు, వేంకటేశ్వరుని పరిసరాల్లో కొలువైన మిగతా దేవతలు...ఎక్కడికక్కడే కూర్చొని అలా వుండిపోవాలనిపించే అనిర్వచనీయమైన భావపరంపర మనసులో నిండిపోతూంది. దైవదర్శనం కూడా తిరుపతిలోలా 'తోపుడు బండి' వ్యవహారం కాదు. హాయిగా దర్శనం చేసుకొని, గర్భగుడి ముందున్న చందన తిలక ధారణ చేసి, ప్రసాదం తీసుకోగానే ఏదో పవిత్రత అంతరంతరాలలో ప్రసరిస్తున్న భావన కల్గింది.

ఆ వెంటనే బిర్లా ప్లానెటోరియంలో ఓ షో చూయించాడు గిరి. అది మరీ విచిత్రంగా ఉంది. ఉన్నచోట నుండే ఉదక మండలం దాటి నక్షత్రాలు, గ్రహాలూ చుట్టేసి వచ్చేశాం. ముఖ్యంగా జొన్న చేను కావలి కోసం పొలానికెళ్ళి, మంచె మీద అమావాస్య రాత్రుల్లో చూసే ఆకాశం అందాలు - ఇలా ఓ గదిలో కూర్చొని చూడటం మనసుకి గిలిగింతలు పెట్టింది.

ఆదివారం- హైదరాబాదు చిహ్నం చార్‌మినార్‌ని

చూశాం. ఇది ఇంత అందమైన నగరం ఎందుకైందో అది చూడగానే అర్థమైంది. నాలుగువందల సంవత్సరాలపైగా చరిత్ర గలిగిన చార్మినార్ నగర సౌందర్య విస్తృతికి ఎంత ప్రేరణనిచ్చిందో ఆ నిర్మాణంలోని ప్రతి అంగుళం చాటి చెబుతోంది. మబ్బుల్ని ముద్దెట్టుకుంటున్న నాలుగు మినార్లూ, చుట్టూ రకరకాల వేషభాషల జనాలూ- సినారె పాటని గుర్తుకు తెచ్చాయి. 'ఇది హైదరాబాదు..ఇది భిన్న సంస్కృతులు ఎదిగి పూచిన పాదు' మొదటి అంతస్థువరకూ ఎక్కాం. అంబారీ ఏనుగు నెక్కినంత సంబరం.

చివరగా జూపార్కు కెళ్ళాం. 'ఇంతటి జనారణ్యంలో అంత మహారణ్యమా?' అనిపించింది. మన ప్రాంతంలో కనిపించే మామూలు పిట్టలూ- పాములేగాక దేశ విదేశాల్లోని రకరకాల పక్షులు, జంతువులు, పాములూ... ఎన్నని చెప్పాలి? వాటన్నిటినీ దగ్గరగా చూస్తూంటే రకరకాల మనోభావాలు, ఎన్నో ఊహలు..ప్రపంచమంతా తిరిగి వచ్చినంత సంతోషం- అక్కడే ఉండిపోతే బావుండుననిపించింది.

★ ★ ★

''శీనూ! ఈ రోజు నేను డ్యూటీకెళ్ళాలిరా! సాయంత్రం 'ఆర్య' సినిమా చూద్దాం. రేపు సెలవు దొరికితే రామోజీ ఫిల్మ్‌సిటీకెళ్దాం..అన్నట్టూ...ఈ టిఫిన్ బాక్స్‌లో ఇడ్లీ-వడా ఉంది. తినేసెయ్! నీకు డ్రామాలూ, కల్చరల్ ప్రోగ్రాంసంటే ఇష్టం కదా! పేపర్‌లో-డిస్ట్రిక్ట్ టాబ్లాయిడ్‌లో సిటీ డైరీ ఉంటుంది. రవీంద్రభారతిలోనో, త్యాగరాయ గాన సభలోనో నీకు నచ్చిన ప్రోగ్రాం చూసి, అక్కడే మంచి హోటల్లో భోం చేసి నాలుగింటి వరకూ రూం కొచ్చేసెయ్. నేనూ తొందరగానే వస్తాలే. నా దగ్గర డూప్లికేటుంది. తాళం వేసుకొని పో'' రికార్డు చేసుకొని పెట్టుకున్నట్టు వాడు చకచకా అన్నీ వల్లించి, గబగబా మెట్లుదిగి పోయాడు.

పడుకున్న చోటినుండే కళ్ళు తెరిచి గోడగడియారం వైపు చూశాను. 'అబ్బో! తొమ్మిదిన్నరయ్యిందా?' అనుకున్నా! ఊళ్ళో ఎప్పుడూ ఆరు దాటింతర్వాత లేచిన గుర్తులేదు. రాత్రి ఆలస్యంగా పడుకోవడం, చల్లని ఏసీ గాలికి ఒళ్ళెరగకుండా నిద్ర పట్టేసింది. మా గిరిగాడు బ్రహ్మచర్యంలోని సుఖాన్ని బ్రహ్మాండంగా అనుభవిస్తున్నందుకు ఒకింత అసూయ కల్గింది. అంతలోనే పాపం! అనిపించింది. త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నాడుగా!

ఇదేంటీ లేవగానే పెళ్ళాం గుర్తుకొచ్చింది? నా పిచ్చిగానీ, మరచిపోతేగదా గుర్తుకురావడానికి. కష్టంలో పంచుకునేందుకు లేదని, సుఖం పంచేందుకు లేదని...గుర్తుకు రాకపోతే ఎలా? నిద్దరంతా తేలిపోయింది. స్నానం చేసి, నాలుగిడ్లీలు, రెండు వడలూ దట్టించి, ఫ్లాస్కులోని కాఫీ కమ్మగా కొట్టేసరికి కొత్త హుషారొచ్చింది.



'న్యూస్ పేపర్ చూడాలి!' అనుకుంటూ చుట్టూ పరికించాను. మంచమ్మీద...టీపాయ్ మీద..టేబుల్ మీద..కనిపించలేదు. బీరువామీద మాత్రం పేపర్ల బొత్తులున్నాయి. అలవాటుకొద్దీ వీడు పేపరుచదివి అలా అటకెక్కించేస్తాడేమో. నేనున్న విషయం గుర్తుకు లేదు గాబోలు. 'అది సహజమేలే'.

నెమ్మదిగా టీపాయ్ బీరువా దగ్గరగా జరిపి, పైనున్న పేపర్ తీశాను. అది ఈరోజుది కాదు, మరో పేపర్ తీశాను. అదీకాదు; ఇంతలో మధ్యలో ఓ పేపర్ బయటికి కనిపిస్తూంది. అందులో సగం-సగం మల్లీశ్వరి బొమ్మ కనిపిస్తోంది. అది పట్టి లాగాను. అదే నా కొంప ముంచింది.

అలా లాగడంతో పైనున్న పేపర్లన్నీ నా తల మీద గుమ్మరించినట్లు పడి, ఆపై భుజాల మీదుగా నేల మీదికి దూకాయి. ఫ్యానుగాలికి అవి గదిలోని నేల నిండా పరచుకున్నాయి. నా తెలివితక్కువ తనానికి నామీదే కోపమొచ్చింది. అంతలో ఫోన్ రింగయ్యింది.

బహుశా మా గిరిగాడికోసమే కావచ్చు. ఎత్తనా? వద్దా? ఏమో- ఎవరైనా గాళ్ ఫ్రెండ్ గావచ్చు. అలాగయితే వాడిలాగే మాట్లాడి ఆ రహస్యమేదో కనిపెట్టెయ్యొచ్చు..రిసీవరెత్తాను. అవతల మగ గొంతు-నిరాశపడిపోయాను. చిరాకనిపించింది.

''సారీ! గిరిలేడు'' పెట్టబోయాను.

''ఒరే శీనూ! నేనే..గిరిని మాట్లాడుతున్నాను. న్యూస్ పేపర్ పక్క ఫ్లాట్ వాళ్ళు తీసుకున్నార్రా..302లో. అడిగి తీసుకో. దానికోసం అనవసరంగా వెతుక్కుంటూ కంగారు పడకు''

నాకు నవ్వొచ్చింది.

''ఓ అరగంటైతే వాళ్ళే ఇస్తారు''

''సరే!'' వాడికిదంతా చెప్పడమెందుకని ఫోన్ పెట్టేశాను.

ఫ్యాన్ ఆఫ్ చేసి, డిస్ట్రిక్ట్ టాబ్లాయిడ్సన్నీ విడిగా, మిగతా పేపర్స్ వేరుగా పెట్టే ప్రయత్నంలో పడ్డాను. ఠక్కున ఆగిపోయాను.

'బిర్లామందిర్ పై నుండి దూకి, ప్రేమికుల ఆత్మహత్య...' గబగబా ఆ వార్త చదివాను. మనసంతా వికలమైపోయింది. నిన్నగాక మొన్న అందంగా కనిపించిన పాలరాతి విగ్రహాలు నెత్తురు మరకలతో వికృతంగా అనిపించసాగాయి.

మరో పేపర్...

'హుసేన్ సాగర్‌లో పడవ ప్రమాదం' అందరూ చూస్తూండగా పసిబాలుడు నీళ్ళలో మునిగిపోయిన వైనం- ఎంతో అందంగా ఆకర్షణీయంగా, థ్రిల్లింగ్‌గా కనిపించిన పడవ ప్రయాణం..హాహాకారాలతో-గగ్గోలుతో భయకంపితుడ్ని చేసింది.

ఇంకో చోట-

సినిమా వేషం కోసం సిటీ చేరిన అమ్మాయిని ఓ ఆటోవాలా ఎంత భయంకరంగా వంచించాడో వర్ణించారు. 'మల్లీశ్వరి'లా మారేందుకు ఎంత మంది అమాయక యువతులు బలి అవుతున్నారో తలచుకుంటే గుండె మెలిపెట్టినట్లైంది.

'గోల్కొండలో దారుణ హత్య..'

ఆనాటి వాస్తు శిల్పుల ఆ దృశ్యం చూసి గోడుగోడున విలపిస్తున్నట్టు తోచింది. శ్రీరాముని కరుణ కోసం విలపిస్తున్న రామదాసు కళ్ళలో నీళ్ళకు బదులు నెత్తుటి ధారలు.

'జూ లో సాకీ హత్య..'

ఎంతో అమాయకంగా గంతులేస్తూ, చూపరులను ఆకట్టుకొంటున్న జంతువులన్నీ-రకరకాల ఆయుధాలు ధరించిన నరరూప రాక్షసులు తమను వెంటాడుతుంటే భయంతో రోదిస్తూ పారిపోయే మార్గంలేక గిలగిలా కొట్టుకుంటూ విలవిల్లాడిపోతున్నాయి.

అలా-ప్రతి రోజూ టాబ్లాయిడ్‌లో ఓ భయంకర ఘట్టం-

'స్నేహితుని తల్లిదండ్రుల్ని నరికిన కిరాతకుడు..'

'తనను ప్రేమించలేదని ఓ యువతిని నడిరోడ్డు మీద పొడిచి చంపిన ఉన్మత్తుడు..'

'భర్త మరణంలో భార్య ప్రధాన నిందితురాలు..'

'స్నేహితుడే యముడు..'

'కాపాడాల్సిన వాడే కాటేశాడు..'

'ఏడేళ్ళ పసిపాపను అంగుళం ఖాళీ లేకుండా బ్లేడుతో కోసిన బాబాయి..'

నా తల గిర్రున తిరిగిపోయింది!

కాగితం, కలం తీసుకున్నాను.

'గిరీ! నిన్నటివరకూ నందనవనంలా అనిపించిన నగరం ఇప్పుడు నరకకూపంలా భయపెడ్తోందిరా. ఈ వాతావరణంలో ఇంకో గంట గడపటం కూడా నాకు చిరాగ్గా వుంది.

ఇక్కడ అనుభవించే సుఖం, సౌకర్యాలూ వెలకట్టలేనివే.

అంతకుమించి చుట్టూ జరుగుతున్న దారుణాలు పరమాన్నంలో నెత్తురుముద్దల్లా కంపరం పుట్టిస్తున్నాయి.

'నెత్తుటి మరకలు లేని రోడ్డు లేదు; మోసం - దగా లేని వీధి లేదు; అన్యాయం లేని రంగం లేదు; దారుణాలు జరగని రోజు లేదు; హత్యలూ-ఆత్మహత్యలూ లేని సమాజం లేదు; ఇక్కడి నవ్వుల వెనుక రోదనలు, సంతోషం వెనుక వేదనలు, సుఖాల వెనుక కన్నీళ్ళూ కనిపిస్తున్నాయిరా!

వేల లక్షల ప్రేతాత్మలు కరాళ నృత్యం చేస్తూంటే వాటి మధ్య ప్రశాంతంగా ఎలా నిద్రపోతున్నార్రా మీ నగర వాసులు???

'ఒక పూట తిండి లేకున్నా సరే! కార్లలో షికార్లూ, సినిమాలూ, రంగు రంగుల అందాలూ కనిపించక పోతేనేం? నాకు మా ఊరే అందంగా వుంది.

'పైలం బిడ్డా!' అంటూ ప్రతిదానికీ ప్రేమతో మందలించే అమ్మ;

రంగులేకున్నా ప్రేమను పంచే మా ఆవిడా;

రంగూ-రుచీ లేకున్నా స్వచ్ఛమైన ఆత్మీయతతో లభించే అమృతం వంటి నీళ్ళు; నా ఎర్రావు-నల్లకుక్క; కుంట కట్టా-చిట్టి చేపలు; మట్టివాసన...

నేను వెళ్తున్నాను..నీ ఆతిథ్యానికి థాంక్స్. నువ్వొక్కసారి తప్పకుండా మా ఊరికిరా! ఇంతకంటే అందమైన, స్వచ్ఛమైన, అద్భుతమైన దృశ్యాలు చూయిస్తా కానీ ఖర్చులేకుండా. వస్తావు కదూ!

-నీ శ్రీను.'

టీపాయ్ మీద ఉత్తరం పెట్టేసి, డోర్ లాక్ చేసి, మా ఊరికి బయలుదేరాను. ✪

## ఆనందం

**అమృతా అరోరా ఆనందానికి అంతే లేకుండా పోతోంది. మొన్నామధ్య ఓ ఫంక్షన్‌లో సంజయ్ దత్ ఇచ్చిన కాంప్లిమెంట్ ఆమె ఈ ఆనందానికి కారణంగా చెబుతున్నారు. రక్త్ షూటింగ్‌లో ఆయనతో నటించడానికి కొంచెం ఇబ్బంది పడిన అమృతాకి కొన్ని విషయాల్లో సలహాలిచ్చి ముందుకి నడిపించాట్ట సంజయ్‌దత్. అప్పటినుంచీ ఆమెకి సంజయ్ అంటే అభిమానం బాగా పెరిగిపోయిందిట. కొన్ని సంఘటనలు మన ఆలోచనని మార్చేస్తాయంటారు. ఇలాంటివి చదివినప్పుడు అది నిజమేనేమో అన్పిస్తుంది.**

